క్లుప్తంగా

హిడెన్ స్ప్రౌట్స్‌కు ప్రింటర్ వితరణ



ప్రింటర్ కొనుగోలుకు చెక్కు అందిస్తున్న పైడి రజని

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకురాలు, శక్తి ఎంపవరింగ్ వుమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజనీ తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం నగరంలోని హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలకు ప్రింటర్ అందజేశారు. పిల్లలు మంచి వృద్ధిలోకి రావాలని అభిలషించారు. పాఠశాల ప్రతినిధి శ్రీనివాస్‌కు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కృష్ణకుమారి, ఇంగ్లిష్ టీచర్ జీఎస్ ప్రసన్న సమక్షంలో ప్రింటర్ అవసరమైన మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీ రావు, ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, శంకర్‌నారాయణ, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దొరికిన పర్సు అప్పగింత



దొరికిన పర్సు అందిస్తున్న రత్నశేఖర్

మద్దిలపాలెం : రామాటాకీస్ రోడ్డులో దొరికిన పర్సును బాధితుడు ఇంటికి వెళ్లి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు ఓ వ్యక్తి. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి రామాటాకీస్ రోడ్డులో ఆటోలో వెళ్తున్న రత్నశేఖర్‌కు ఓ పర్సు దొరికింది. దాంట్లో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చిరునామా ఆరా తీశాడు. పర్సు పోగొట్టుకున్న వ్యక్తిది పాత వెంకోజీపాలెంగా గుర్తించి, ఆ ప్రాంతం వలంటీర్‌ను కలిసి రత్నశేఖర్ పర్సు అప్పగించాడు. సదరు వలంటీరు ఆ పర్సును బాధితుడికి అప్పగించారు. ఆయన రత్నశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నారాయణ' సత్తా



విద్యార్థులతో కళాశాల డీన్ రామలింగేశ్వర రావు, డీజీఎం హనుమంతురావు

సీతమ్మధార: సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ప్రతిభకనబరిచారు. ఈ మేరకు ఆశీలుమెట్టలోని సంస్థలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డీన్ రామలింగేశ్వరరావు, డీజీఎం హనుమంతురావు అభినందించారు. ఎంవీవీ హర్షవర్ధన్ 490, పీలా తేజశ్రీ 487, ఎం.నిహారికా నాయుడు 485, సువ్వాడ మౌనిషా నాయుడు 485, హనుమంత్ నితిన్ 484, పొట్నూరు సాత్విక్ 484, పొన్నాడ రాజశ్రీ 484 మార్కులతో సత్తా చాటారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో సత్యసాయి ప్రతిభ

విశాఖ విద్య: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్ స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. 195 మంది విద్యార్థులకు 135 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. మాస్టర్ సత్య శృతిష్ 98 శాతం మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పాఠశాల కన్వీనర్ ఎస్‌జీ చలం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజల చెంతకు వైద్యం

- 16వ వార్డులో అందుబాటులో యూపీహెచ్‌సీ సేవలు
- వారంలో 4 రోజులు స్పెషలిస్టు వైద్యులు
- 10 పడకలతో ప్రత్యేక వార్డు



ఆధునిక ల్యాబ్



సిద్ధంగా 10 పడకలతో ప్రత్యేక వార్డు



16వ వార్డులో ఇసుకతోట పట్టణ ప్రాథమిక వైద్య కేంద్రం

మద్దిలపాలెం: పట్టణ ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో ఏర్పాటైన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక వైద్య కేంద్రాలతో పేదలకు ఆధునిక వైద్యం అందుతోంది. చిన్నపాటి జబ్బు చేస్తే ప్రైవేటు, కార్పొరేటర్ ఆస్పత్రులకు పరుగులు పెట్టి చేతులు కాల్చుకోవాల్సిన అవసరం ఇక లేదు. ఎంచక్కా ఇంటికి కూతవేటు దూరంలో ప్రతి 30 వేల జనాభా ఉండే ప్రాంతానికి ఒక్కో యూపీహెచ్‌సీ అందుబాటులోకి వచ్చింది. అలాంటి గొప్ప ఆరోగ్య కేంద్రం ఇప్పుడు జీవీఎంసీ 16వ వార్డు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా నిర్మించారు. ప్రాథమికంగా ఇక్కడ వైద్యం అందిస్తారు. అందుకు కావాల్సిన వైద్య పరీక్షలు సైతం ఉచితంగా చేస్తారు. వ్యాధి తీవ్రతకు అనుగుణంగా కేజీహెచ్‌కు రిఫర్ చేస్తారు. అప్పటి వరకూ ఆస్పత్రిలో వైద్యం అందించడానికి వీలుగా ఆధునిక ల్యాబ్‌తో పాటు, రోగులను ఇన్‌పేషెంట్‌గా ఉండేందుకు 10 బెడ్లతో కూడిన ప్రత్యేక వార్డు అందుబాటులో ఉంది. దీంతో ఈ కేంద్రంలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో తక్షణ వైద్య సేవలు అందుతున్నాయి. వారంలో నాలుగు రోజుల పాటు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారు.

- 16వ వార్డు పరిధిలో ఏడు సచివాలయాలున్నాయి. వెంకోజీపాలెం సచివాలయ నుంచి 4,200 మందికి, సీతమ్మధార 3,938 మంది, ఇసుకతోట 4,387 మంది, మద్దిలపాలెం 4,434, నక్కవానిపాలెం 4,125, పాత రేసపువానిపాలెం 4,300 మంది ఈ కేంద్రం నుంచి వైద్య సేవలు పొందనున్నారు.
- ఇన్‌పేషెంట్‌గా ఉండేవారికి, అనారోగ్యంతో వైద్యం కోసం వచ్చే వారికి ఉచితంగా రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా ఆధునిక పరికరాలతో కూడిన ల్యాబ్ ఉంది. ఇందులో సుమారు 63 రకాల పరీక్షల వరకూ ఉచితంగా చేస్తారు.

స్పెషలిస్ట్ వైద్యులు

- ప్రతి బుధవారం ఆర్థోపెడిక్ వైద్యుడు
- ప్రతి గురువారం ఈఎన్‌టీ వైద్యుడు
- శుక్రవారం జనరల్ మెడిసిన్
- శనివారం చర్మవ్యాధుల నిపుణులు.

పేదలకు మెరుగైన వైద్యం



కేంద్రానికి వచ్చిన పేద రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. రక్త పరీక్షలకు ప్రత్యేక ల్యాబ్ ఉంది. అత్యవసరమైతే ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుంటాం. 10 బెడ్లతో వార్డు అందుబాటులో ఉంది. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం వ్యాధి తీవ్రతను బట్టి కేజీహెచ్ తరలించేలా ఏర్పాటు చేస్తాం. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ మారుపల్లి హారిక, వైద్యాధికారి

కుంభా రవిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు



కుంభా రవిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏయూ పూర్వ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు జన్మదినం సందర్భంగా ఏయూ పూర్వవిద్యార్థులు, ఆచార్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీఐపీ రోడ్డులోని రవిబాబు నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇటీవల ఎస్టీ కమిషన్ వార్షిక నివేదికను విడుదల చేశామన్నారు. జగన్ సర్కారు గిరిజనుల సంక్షేమాన్ని చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, ఏయూ ఆచార్యులు ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య అరుణ్‌కుమార్, ఆచార్య బసవయ్య, పూర్వ విద్యార్థి పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్, ఆనంద్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. యాంటీ లార్వా నివారణ కోసం తరచూ మందులు పిచికారీ చేయాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి మణి మాట్లాడుతూ ఆస్పత్రుల సమన్వయంతో పని చేసి వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి డాక్టర్ మురళీమోహన్, ప్రపంచ ఆరోగ్య ప్రతినిధి డాక్టర్ ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంత్యుత్సవాలు రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీపీపీ సభ్యులు

ఎంవీపీ కాలనీ: హిందూ ధర్మ ప్రచార పరిషత్(డీపీపీ) ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, డీపీపీ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు పోస్టర్‌ను శుక్రవారం ఎంవీపీ కాలనీలోని డీపీపీ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఎస్‌కే చంద్రమౌళీశ్వరశర్మ, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబికాబాగ్‌లోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం, అనకాపల్లిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం, జి.మాడుగులలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీవారి భక్తులంతా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యకుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సేవకు మరో రూపం నర్సులు



కేక్ కట్ చేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్



నర్సింగ్ ఇన్‌చార్జి రాధను సత్కరిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

మహారాణిపేట: కేజీహెచ్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించడంలో నర్సులకు ఎవరూ సాటిరారన్నారు. అనంతరం కేక్ కట్ నర్సులకు పంచిపెట్టారు. రిటైర్ అయిన నర్సులు పి.సరోజని, బి.సీతలతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సులు జయప్రద, వరలక్ష్మి, రాజకుమారి, పుష్ప, ఎల్.టి సుందరి సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్ నర్సులు డి.లక్ష్మి, పి.వరలక్ష్మి, వి.ఉషారాణి, ఎస్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో..

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నర్సింగ్ విభాగం ఇన్‌చార్జి రాధ, స్టాఫ్ నర్స్ వి.జ్యోతి, కల్యాణ్, తిరుమల, దుర్గ తదితరులను డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సత్కరించారు. వైద్య రంగంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ భవానీప్రసాద్, ఆర్ఎంవోలు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మృదుల, డాక్టర్ కృష్ణప్రియ, డాక్టర్ శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి



వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న జానకీరామ్

బీచ్ రోడ్డు: వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని విద్యార్థి విభాగం విశాఖ, విజయనగరం, అనకాపల్లి జోనల్ ఇన్‌చార్జి ఆర్.జానకీరామ్ అన్నారు. తనను ఇన్‌చార్జిగా నియమించినందుకు పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని శుక్రవారం కలిసి జానకీరామ్ కృతజ్ఞతలు తెలిపారు. మూడు జిల్లాల పరిధిలోని విద్యార్థులను సమన్వయపరుస్తూ తన బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న ప్రేమజ ఆదిశర్ల

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అన్నీ ప్రేమజ ఆదిశర్ల రూపొందించిన 'ఐయామ్ ఏ నర్స్'పాట విడుదలైంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె ఈ పాటను విడుదల చేశారు. కేజీహెచ్‌లో 38 ఏళ్ల పాటు నర్సింగ్ వృత్తిలో కొనసాగి రెండేళ్ల కిందట నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసిన తన తల్లి ఎవాంజెలిన్ ఎస్తేర్‌కు ఈ పాటను అంకితం ఇస్తున్నట్లు ప్రేమజ తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో నర్సుల పాత్రను తెలియజేస్తూ రూపొందించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు. ఈ పాటకు సాహిత్యం తానే అందించానని, సూరజ్ గిప్సన్ సంగీతం, మనోహర్, పీటర్ వీడియో ఎడిటర్లుగా సహకారం అందించారని చెప్పారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా



ఎంపికైన విద్యార్థులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా జరిగింది. విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థ అయిన హెచ్‌సీఎల్‌లో టెక్ బీ ప్రవేశాలకు ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. జిల్లా నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులుగా గుర్తించారు. ఈ ఇంటర్వ్యూల్లో 11మంది అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ మేనేజర్ అనీల్, క్లస్టర్ మేనేజర్ సాయి కిరణ్, యుగేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 – 2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందించిన హృదయాలకు ధన్యవాదాలు



కలెక్టర్ ఇచ్చిన చెక్కుతో మేయర్ హరి వెంకటకుమారి, బాలుడి కుటుంబ సభ్యులు

ఆరిలోవ: తక్షణ సాయంగా రూ.లక్షతో పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హృద్రోగ బాధిత కుమారుడితో కుటుంబ సభ్యులు శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కలిశారు. తమ ఆవేదనను ముఖ్యమంత్రికి వివరించేందుకు సహకరించిన మేయర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. గురువారం అపోలో ఆస్పత్రిలో కార్యక్రమం ముగిసిన అనంతరం కాన్వాయ్ తిరిగి వెళ్తుండగా హృద్రోగ బాధిత బాలుడు వానపల్లి చరణ్‌సాయి మణికంఠను తీసుకొని తల్లి పార్వతి ముఖ్యమంత్రిని కలిసిన విషయం తెలిసిందే. బాలుడి పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఆమెకు వెంటనే తక్షణ సహాయం అందించాలని కలెక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. ఈ మేరకు జేసీ విశ్వనాథన్ రూరల్ తహసీల్దారు రమణయ్యతో కలసి అదేరోజు సాయంత్రం ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్‌లో ఉన్న పార్వతి ఇంటికి వెళ్లి తక్షణ సహాయం కింద రూ.లక్ష చెక్కు అందజేశారు. భవిష్యత్తులో పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో తన కుమారుడి పరిస్థితి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి సహకరించిన మేయర్‌ను శుక్రవారం పెదగదిలిలో క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని వినతి



వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సురేష్

ఎంవీపీ కాలనీ: విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3 వేల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని వికలాంగ సంక్షేమ సంఘం నాయకుడు డాక్టర్ సురేష్ మీనన్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఏయూలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి మెరుగు నాగార్జునకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మీనన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో 3 వేల అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు వివిధ కారణాల వల్ల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తొలగించిన 25 మంది గెస్ట్ ఫ్యాకల్టీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యాదీవెన అందించాలన్నారు.

నేడు సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఎన్టీ రామారావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని శనివారం ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు డి.భూపతిరాజు, ఎం.కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ చేతుల మీదుగా తన నివాసంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ స్వరాంజలి, స్వరార్చన సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా.. జయమ్ము నిశ్చయమ్మురా.. పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫణిభూషణ్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్, నాగేశ్వరరావు, జ్యోతి, సత్యవతి, కల్యాణి, ధరణి, నిహారిక, ఉమాప్రియా తదితర గాయనీ గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలు ఆలపించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, స్వరమాధుర్యం అధ్యక్షుడు ఎంవీఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కేంద్రం పరిశీలన



తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎంవీపీ కాలనీ: స్థానిక అంజయ్యనగర్ సమీపంలో కైలాసగిరి కొండను ఆనుకొని ఉన్న జీవీఎంసీ తాగునీటి సరఫరా కేంద్రాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి శుభ్రతలో జీవీఎంసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ కొంతకాలంగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ కేంద్రాన్ని పరిశీలించినట్టు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో విఫలమయ్యారన్నారు. ట్యాంకును క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ మురళీమోహన్‌రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

15 రోజులకోసారి మండలస్థాయిలో స్పందన

- రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి స్పందన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తి మండలంలో నెలలో రెండు శుక్రవారం రోజుల్లో స్పందన నిర్వహిస్తామని చెప్పారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు నెలలో రెండుసార్లు పదిహేను రోజులకోసారి విశాఖలోని ఆరు మండలాల్లో స్పందన నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో అధికారులు తీసుకున్న నిర్ణయాలకు అర్జీదారులు తృప్తి చెందకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలస్థాయిలో స్పందన పెట్టడం ద్వారా క్లిష్టమైన సమస్యలు ఉన్నవాళ్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాలేనివాళ్లు, వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో స్పందన నిర్వహించడం వల్ల అధికారులు, వీఆర్‌వోలు సిబ్బంది అందుబాటులో ఉండి అప్పటికప్పుడు సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.24 గంటల్లో సమస్య పరిష్కారం అవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. క్లిష్టమైన సమస్యలు సమయానుకూలంగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదన్నారు. పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి పొందేలా సమస్య పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పెందుర్తి తహసీల్దారు ఆనంద్ కుమార్, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం నేడు

సీతంపేట: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కళారాధన పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రంగస్థల నటులు టీకి వీరభద్రాచారి, పసుమర్తి సన్యాసిరావు, సాహితీవేత్తలు సాలిపల్లి మంగామణి, వృద్ధుల కల్యాణ రామారావు, పాత్రికేయులు ఆర్.శివకుమార్, గాయని పల్లా మనోరమ, సేవారంగంలో రాయపల్లి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ అభిమాని బంటు అర్జునరావు, ప్రజా సేవా రంగంలో మోడేకుర్తి సత్యనారాయణ, కూచిపూడి నృత్య కళాకారిణి వాణి పద్మజలకు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.